# పంచభూతాలు

కథా నిలయం
శ్రీకాకుళం

## మొదటి భూతం చెప్పిన కథ

నా పేరు శేషగిరి. మా స్వగ్రామం బడేపురం. నాకు ఆట్టే ఆస్తి పాస్తు లేమీ లేవు. చదువుకూడా అంతంత మాత్రం గానే వచ్చు. అసలు మా వంశంలో చదువనేది ఆనువాయితీ లేదు. మా తాతకు చదువు రాదు, మా నాన్నకు రాదు. నన్నయినా ఓ ప్రయోజకుణ్ని చేయాలన్న ఉద్దేశంతో మా మేనమామగారు శతపోరుకు లాడాట్ట. ఆ సమస్యను భరించలేక మా నాన్న నన్ను కోటయ్య పంతులు గారి వీధి బడిలోకి పంపించాట్ట.

కోటయ్య పంతులుగారు పిల్లలకు చదువు చెప్పే పద్ధతుల్లో భయంకరమైన విధానాలు చాలాఉన్నాయి. ఆలస్యంగా వచ్చిన వారినీ, పాఠం వొప్పచెప్పలేని వారినీ, కోదండం

తీయించి, అరికాళ్ళ మీద ఈత బెత్తాలతో బాదడమూ, పెద్ద గుంజీళ్ళు తీయించడమూ, వొంటికాలిమీద గోడ కుర్చీ వేయించడమూ వంటి నాజూకులు చాలా ఉండేవి. అవన్నీ చూశాక - దిక్కుమాలిన చదువు లేకపోయినా మా బాగే నని పించింది నాకు.

ఇన్నేళ్ళొచ్చాక, ఇంత జీవితం చూశాక కూడా, నాకు చదువు పట్ల సదభిప్రాయం లేనే లేదు. చదువు మనిషికి వివేకాన్నిస్తుం దనడాన్నికూడా నేను నమ్మలేకుండా ఉన్నాను. ఎందుకంటున్నానంటే - రాత్రింబవళ్ళు బళ్ళ కొద్దీ పుస్తకాలు పడ చదివి, పెద్ద పెద్ద డిగ్రీలు తెచ్చుకొన్నవారు, అణా డబ్బులు సంపాదించ లేకా, పెళ్ళాం పిల్లలను పోషించ లేకా, దేశాలమీదకు పోవడమూ, ఆత్మ హత్యలు చేసుకోవటమూ నాకు తెలుసు. అలా చదువుకొన్నవారు చాలా మంది నా ముందు పశ్చాత్తాపపడిన దాఖలా లున్నాయి. అంతదాక వెళ్ళ నవసరం లేదు. మా పరంధామయ్య బావకు ఏపాటి చదు వొచ్చు గనుక? ఆయన లక్షల మీద వ్యాపారం చేస్తున్నాడు. మా జిల్లాలో ఆయన కాదంటే తప్ప, మరొకరికి గవర్న మెంటు కాంట్రాక్టులు వెళ్ళవు. ఆయన చేతికింద పదిమంది 'వివేకులు' - పెద్ద చదువులు చదివినవారే - పని చేస్తున్నారు. డబ్బున్న వాడికి చదు వేమీ అవసరం లేదని ఇప్పటికీ నా నమ్మకం. పాతిక రూపాయలు పడేస్తే, బియ్యే చదివిన వాడొచ్చి, నువ్వు చెయ్యమన్న అరవ ఛాకిరీఅంతా చేస్తున్నప్పుడు, కష్టపడి,

బోలెడంత డబ్బుపోసీ, చదువుకోడంలో నాకు అర్థం కని పించదు. ముందెప్పుడో రోజులు మారతాయని నువ్వంటావు. మారితే మారొచ్చు గాక! అప్పుడైనా డబ్బుకు విలవలేకుండా పోతుందని నువ్వనగలవా?

చెప్పవచ్చిందేమిటంటే - నాకు చదువు రాకపోవటానికి కారణం, మాకు బాగా డబ్బుండటమే! ఆ రోజుల్లో మా నాన్న నీలి మందు వ్యాపారం చేస్తుండేవాడు. రెండు చేతులా ఆర్జించి పోస్తుండేవాడు. ఇప్పటిలాగా ఆ రోజుల్లో కాయితా లుండేవి కావు. ఉన్నా బహు తక్కువ. రాణీమార్కు రూపా యలూ, బోడి రూపాయలూ ఉండేవి. నీలి మందు గుంటూ రులో అమ్మి, రెండెడ్ల సవారీబండి మీద ముల్లె తీసుకొని, మా నాన్న ఇంటికొచ్చేవాడు. ఆ రోజుల్లో మేం డబ్బు దాచే కుంభకోణం చెంబు, ఇప్పటికీ మా ఇంట్లో ఉంది. ఇప్పుడు దాంట్లో తిరగమోత గింజలు దాస్తూ ఉంది మా ఆవిడ.

మా అక్కయ్య పెళ్ళినాటికే, మా వ్యాపారం దిగ జారుడులో పడింది. జర్మనీవాడు మాయ నీలి మందును దేశం లోకి దింపాడు. మా సరుక్కు గిరాకీ పడిపోయింది. ఆ సంవత్స రం మా అమ్మ మూర్ఖప్పట్టు పట్టి, రవణక్కయ్య పెళ్ళిచెయ్య బట్టి గానీ, మా నాన్న మాటల ప్రకారం మరొక్క పడాది ఆగినట్లయితే, ఆమె పెళ్ళి జరిగిఉండేది కాదు. అథవా జరిగినా, పరంధామయ్య లాంటివాడు మాత్రం అసలే దొరికేవాడు కాదు. పెళ్ళి నాటికి మా బావ కేమీ లేదు. మరీ బికారని

కాదు గానీ, మాతో పోలిస్తే ఆయన కున్న ఆస్తి చెప్పుకో దగ్గింది కానేకాదు. అయితే ఎందుకు చేసినట్టు? దీనికి కారణం నా కిప్పటికీ తెలీదు. ఈ పెళ్ళి జరిగిన ఏడాదికే మా పరిస్థితి పూర్తిగా డీలా పడిపోయింది. రాబడి తగ్గిపోయింది కానీ ఖర్చులు మాత్రం అలానే ఉన్నాయి. ఆదాయంతో సరిపుచ్చుకోవటం మా నాన్నకు చేత కాలేదు. చివరికి నానా యాతనలూ పడవలసి వచ్చింది.

మా నాన్న కాలం చేసిన్నాటికి, నా కున్నదల్లా, ఒక్క పెళ్ళాం ఒక్క కూతురూనూ! మా అమ్మ అంతకు ముందే దాటిపోయింది. ఆవిడ అనేకసార్లు 'ముత్తయిదు చావు చావాలని ఉందిరా శేషూ!' అని వాపోవటం నాకిప్పటికీ జ్ఞాపకం ఉంది. భగవంతుడు ఆమె కా వరాన్నిచ్చి పారేశాడు. ఆమె చావు - నిజంగా చావులాగా లేదు. అనగూడదు గానీ, బ్రహ్మాండమైన పెళ్ళి జరిపినట్టు జరిపాడు మా నాన్న. అప్పటికే మేం దిగజారుడులో ఉన్నాం. ఆ సంగతి చాలా గుంభనగా ఉండిపోయింది. నా పెళ్ళయిన ఆరు మాసాలకే, అమ్మగారు గతించడంవల్ల, దానికి కారణం నా పెళ్ళామే నన్నారు నలుగురూ.

మనుషుల్ని అర్థం చేసుకోవడంలో మనం గమనించవలసినవి చాలా ఉంటాయని నా నమ్మకం. ఒక మనిషి మంచివాడో చెడ్డవాడో తేల్చడంలో, మన అంచనాలు చాల వరకు అస్తవ్యస్తంగా ఉండే అవకాశం ఉన్నదనుకొంటాను. మంచి

చెడ్డలు రెండూ కలగలిసే ఉంటాయనీ, ఆ యా సందర్భాలలో ఆ యా గుణాలు బయటపడుతూ ఉంటాయనీ, నా నమ్మకం!

మా పరంధామయ్యా బావ మంచివాడా, చెడ్డవాడా అంటే నేను చెప్పలేను. ఈ రెండింటి ప్రభావాన్నీ నేను అనుభవించాను. దిక్కూ దివాణంలేని స్థితిలో నేనున్నప్పుడు స్వయంగా వచ్చి ఆదరించాడు. తనతో బాటు వచ్చెయ్యమన్నాడు. ఉన్న ఇంటిని అయిన కాడికి అమ్మేసి చిల్లర మల్లరలు తీర్చేసి, పాతికా పరకా ఉంటే దగ్గరుంచుకోమన్నాడు. తనకొక్కడికే పని తెమలడం లేదనీ, చేతికిందికి ఆసరాగా ఇంకెవరినన్నా వేసుకొందామని ఉన్నదనీ అన్నాడు. నేనే వస్తానంటే అంతకన్నా తనకు కావలసింది కూడా లేదన్నాడు. లెక్కలకోసం జీతమంటూ ఏదో ఏర్పాటు చేసినప్పటికీ, అవసరమయినప్పుడు కాస్త అటూ ఇటూగా వాడుకొన్నా ఫర్వాలేదన్నాడు. ఇంతకన్నా ఎవడు మాత్రం కోరవలసిందేమి ఉంటుందిగనకా?

నామట్టుకు నాకీ పద్ధతి బాగా నచ్చింది. పట్టుపట్టుమంటే నేను చేయగలిగింది కూడా ఏమీ లేదు. డబ్బున్న రోజుల్లో చదువు అవసరం తెలిసి రాలేదు. అది తెలిసేనాటికి డబ్బు కాస్తా లేకుండాపోయింది నేను "సరే" నన్నాను. మా బావే స్వయంగా ఇల్లు అమ్మకాలూ, బాకీల సర్దుబాట్లూ చూశాడు. తట్టాబుట్టా నెత్తి నేసుకొని, బడేపురానికి శాశ్వతంగా సెలవు చెప్పి బయలుదేరాను. చూసినవారందరికీ మా

బావ ఎంత గొప్ప సాహసం చేసిందీ తెలిసిపోయింది. ఆ రోజుల్లో ఆయన పేరు జనం నోళ్ళల్లో నాని పోయిందంటే నమ్మండి.

"ఈ పనిచేయడం మంచిదా చెడ్డదా?" అని నిన్నడిగితే నువ్వేమంటావు? 'తప్పకుండా మంచిదేనంటా'వని నాకు తెలుసు. కానీ ఇందులో మా బావ స్వార్థం కూడా బోలెడంత ఉన్న దని నేనంటే నా మీద నీకు కోపమొస్తుందనుకొంటాను. మనిషి చేసే ప్రతి పని వెనకా స్వార్థం ఉంటుం దనడంలో — ఆ పని వల్ల సామాజిక ప్రయోజనం అసలేమీ ఉండదని కానేకాదు. నువ్విచ్చే విరాళంతో ఓ స్కూలు కట్టించి, దానికి నీ పేరే పెడతానంటే నువ్వు పొందే సుఖం వేరు, ఇంకోరి పేరు పెట్టినప్పుడు నువ్వు పొందే సుఖం వేరు. నువ్వు చేసిన ఉప కారానికి ఎదటివారి నుండి "కృతజ్ఞత"ను ఆశించడంలో తప్పులేదు. కానీ ఆ "ఆశించడం"లో అంతో ఇంతో స్వార్థం ఉన్నదన్నప్పుడే నీకు చిర్రెత్తు కొస్తుంది.

మా బావ కేవలం స్వార్థచింతతో నన్ను దగ్గరకు తీశా డని ఇప్పటికీ నేను గట్టిగా అనలేను. కానీ, ఆ దరిమిలా ఆయన ప్రవర్తించిన విధానం అనుభవించాక, అప్పుడప్పుడు నాకీ అనుమానం తగులుతుండేది. ఆయన నన్ను మనిషి లాగా చూడటం క్రమంగా మరిచిపోయాడు. ఆయన నిత్యం వాడు కొనే పనిముట్లలో నన్నూ ఓ పనిముట్టుగా చూసేవాడు. ఇంత కన్నా విడమరిచి చెప్పడం నాకు చాతకావడం లేదు.

మనుషుల మధ్య ఉండే సంబంధాలను డబ్బు నిర్ణయించినంత ఖచ్చితంగా మరో ఏదీ నిర్ణయించదన్న సత్యాన్ని నేను అనుభవం నుండి నేర్చుకొన్నాను. కావటానికి నేను పరంధామయ్య గారికి బావమరిదిని. స్వయానా ఆయన భార్య తమ్ముణ్ణి. కానీ, ఆ ఇంట్లో నౌకరుకుండే పాటి స్వాతంత్రం గానీ, గౌరవం గానీ నాకుండేది కాదు. ఇన్ని గంటల కొచ్చి, ఇన్ని గంటలకు వెళ్ళాలన్న నిబంధన నౌకర్లకు వర్తిస్తుందే తప్ప నాకు వర్తించదు. ఎందుకంటే నేను ఇంటి వారి మనిషిని. ఈ దిక్కుమాలిన సంబంధం నన్ను, పక్షినీ, జంతువునూ కాకుండా చేసింది. ఏదో సామెత చెబుతారే 'పిలుపేమో కన్నతల్లి పిలుపున్నూ, పెట్టేమో సవితల్లి పెట్టూ' నని - అలా అయింది నా స్థితి.

చాలా కాలందాకా నాకేపాటి జీతమో నాకే తెలీదు. కానీ, నెలనెలా గుమాస్తా నాచేత రసీదు మీద సంతకం చేయించుకొంటుండేవాడు. కావలసిన చిల్లికానీ కూడా నేను ఇంకోరి నుండి పుచ్చుకోవలసిన స్థితిలో ఉండిపోయాను. నీ అవసరాలకు, అయిన వారిమీద ఆధారపడటం కన్నా అవమానం మరోటుండ దనుకో.

మా ఆవిడ ఇంటిపనులన్నీ చేస్తుండేది. నేను బయటి పనులు చూస్తుండేవాణ్ని. చెయ్యనని నేనుగానీ, ఆవిడగానీ, అనడానికిలేదు. ఎందుకంటే-మేం పెళ్ళికూతురుతరఫువాళ్ళం. ఆయన ఆదరించేవాడూ, మేము ఆదరింపబడే వాళ్ళమూనూ.

మా అక్కలో కూడా మార్పులు రావడం నేను గమనించాను. ఒక్కోసారి ఆవిడ చాలా చిత్రంగా మాట్లాడేది.

"కుక్కకు నెయ్యికూడా ఇముడుతుందా?" అన్న సామెతను ఆవిడ చాలాసార్లు ప్రయోగిస్తుండేది.

"ఏం నడమంత్రం వొచ్చిపడిందమ్మా! ఈకాస్తకే చేతులు పడిపోయాయా ఏమిటి? మట్టి పిసుక్కోనే దానికి ఇంత ఐశ్వర్యమైతే ఎలా?" అనేది అప్పుడప్పుడు.

ఒకసారి మా ఆవిడ పుట్టింటికి ప్రయాణమయింది. నేనే వెళ్ళి రమ్మన్నాను. తీరా ఆవిడ బయలుదేరబోయే ముందు, మా అక్కయ్య వచ్చి, ఆవిడ చేతిలోని సంచీని వత్తివత్తి చూసింది. దాని కళ్ళల్లో నీరు తిరగడం నేను చూశాను. నా కడుపు తరుక్కుపోయింది. కానీ ఏమీ చెయ్యలేని దుస్థితిలో ఉండిపోయాను.

"బోలెడంత వెండి సామాను, ఆగాబాగీలుగా పడేసి ఉంటుంది. ఒక్క గ్లాసు దాటించేసిం దంటే చాలు. మనమేమన్నా కనుక్కోగలమా ఏమన్నానా?" అన్నది మా అక్కయ్య ఆ తరవాత.

ఆ సమయంలో నువ్వయితే మాత్రం ఏం చేస్తావ్?

డబ్బున్న చాలా మందిలో, నేను మరో గుణం ఉండటం కూడా చూశాను. తమకన్నా డబ్బు తక్కువగా ఉన్న వాళ్ళు, తమ డబ్బును ఎలాగైనా కొట్టేయాలని చూస్తున్నట్టే వారనుకొంటుంటారు. బహుశా ఆ రకమైన ఆలోచన

వారికి ఆనందంగా ఉంటుందనుకొంటాను. మా బావ మట్టి సానకి మా బావ. నెలాఖరున జీతాలివ్వడానికి గిజగిజలాడి పోయేవాడు.

"లక్షలు గుమ్మరిస్తున్నాను. పదులు పోగుచేసుకొంటు న్నాను. ఛ ఛ. ఏం బిజినెస్ వెధవ బిజినెస్," అని విసుక్కొనే వాడు ఆయన.

"ఈ పనివాళ్ళ పొట్టల్లో దయ్యాలుంటాయో ఏమో! ఎప్పుడూ 'డబ్బో డబ్బో' అని కలవరించి ఛస్తుంటారు. ఒక్క రోజు జీతాలివ్వడం ఆలస్యమయితే తన్నుకులాడిపోతారు. పని చేయించుకొన్న వాణ్ని జీతమివ్వనా?" అనే వాడాయన.

ఆయన ప్రవర్తన ఒకొక్కసారి చాలా విచిత్రంగా ఉండేది. సాయంత్రం ఆరు గంటలకు జీతాలు ఇవ్వవలసి ఉంటుం దనుకోండి. ఉన్నడబ్బంతా పదింటికి బాంకులో జమకట్టించి, రెండున్నరకు చెక్కురాసి మళ్ళీ తెప్పించే వాడు. ఒకొక్క సారి "ఇవ్వాళ కొంతమంది తీసుకోండి; రేపు కొంతమంది తీసు కోండి" అనేవాడు. ఇంకొన్నిసార్లు వాయిదా పద్ధతుల మీద జీతం ముట్టచెబుతూ ఉండేవాడు. ఇలా ఎందుకు చేస్తాడో నాకు చచ్చినా బోధపడదు. ఎదటివారు ఇరకాటంలో పడి, గిజగిజా గిజగిజా తన్నుకులాడుతుంటే, చూసి ఆనందించగల మన స్తత్వాన్ని నేను అర్థం చేసుకోలేను. చాలా మంది వ్యాపా రస్థులను నేను చూశాను. నా కళ్ళముందే వాళ్ళు కోటికి పడగలెత్తడం చూశాను. వాళ్ళు పనివాళ్ళను ఉబకేసి ఎక్కువ

పని చేయించి లాభాలు పిండుకొనేవారు. మా బావ దానికి పూర్తిగా విరుద్ధం.

దమ్మిడీలు పోగుచేసి ఆయనగారు కూడబెడుతుంటే, మా ప్రసాద్ వందలకు వందలు తగలేస్తున్నాడు. అటువంటి వాడి కడుపున వీడెలా పుట్టాడో ఏమిటో తెలీదు. వంద రూపాయల నోటంటే పావలాతో సమానంగా చూస్తాడు. వాడికి బొత్తిగా ఆర్థిక దృష్టి లేదు. వాళ్ళ నాన్న పంప నప్పుడు తల్లికి ఉత్తరం రాసేవాడు. ఆమె చాటుమాటుగా బొత్తులకు బొత్తులు పంపడం నాకు తెలుసు.

"వీడి వ్యవహారం చూస్తుంటే నా గుండెల్లో గుండెలుండ టం లేదురా శేషూ! ఇదంతా పట్టుకెళ్ళి ఏ గంగలో కలుపు తున్నాడో తేలీదు. పదిరోజులు వాణ్ని కనిపెట్టుకొని ఉండి ఆ సంగతేమిటో కాస్త కనుక్కురారా" అన్నది అక్కయ్య.

ఒక రకంగా వాడేమయిపోయినా నాకు విచారం లేదు. నన్ను మనిషిని చూసినట్టన్నా చూడని వారి పట్లనాకు జాలి చూపవలసిన అవసరం లేదు. కానీ ఇక్కడే ఇంకో చిక్కు వచ్చిపడింది. ఆ వెధవకు మా సుభద్రంటే వెర్రి వ్యామోహం. సెలవుల కొచ్చినప్పుడల్లా దాన్ని వెంటేసుకొని సినిమాల కనీ, షికార్లనీ పోతుండేవాడు. దాంతో అస్తమానూ బాతాఖానీ వేసుక్కూచునేవాడు. 'ఇదంతా ఏమిటర్రోయ్ బాబూ?' అంటూ లబలబలాడి పోతుంది మా ఆవిడ. 'ఈ రకంగా బజార్లు పట్టుకు తిరిగితే- ఈ దరిద్రానికి తోడు- దానికా

మూడుముళ్ళు పడతాయా?' అంటుంది. 'మీరసలు ఈ సంగతులు పట్టించు కోరే' మంటుంది. నేను పట్టించుకొంటున్నానో లేదో ఆ కూచిముఖం దానికేం తెలుసు? ఇదంతా నాకు తెలియనే తెలియదనుకోవడం మరింత తెలివి తక్కువ. ఆ వెధవకూ మా సుభద్రకూ అంటు పెడితే, నా బెడద సగం తీరిపోయినట్టే లెక్క. చచ్చి పడు జన్మ లెత్తితే మట్టుకు ఇటువంటి సంబంధం దొరుకుతుందా? ఈ సంగతులేవీ మా ఇంటిదానికి తెలీవు.

"మీ అక్కయ్యా, బావా పడనిస్తారుటండీ? మన్నిపురుగుల్ని చూసినట్టు చూసే వారు, మనతో వియ్యం పుచ్చుకొంటారా? మనకేముంది గనక?" అన్నదావిడోసారి.

ఏమీలేని మాట నిజమే! ఆవిడన్నట్టు - పురుగుల్ని చూసినట్టు చూసేమాటా నిజమే! అందుకని బంగారు పిచ్చుకను వొదులు కోవటం మాత్రం ఏమంత తెలివనిపించు కొంటుందీ? ఎందుకు నచ్చిందో సుభద్ర వాడికి వచ్చింది. దానికోసం నానా పల్లద్దాలూ పడుతూ ఉంటాడు. అటువంటి వాణ్ని చేజిక్కించు కొంటే, బొంగరం గిర్రున తిప్పొచ్చు. రేపోమాపో ఆస్తి కంతటికీ, వాడే యజమాని. వాడు అమ్మా నాన్నా మాటలు విని తిరిగి పోతాడేమో నన్న భయం నాకు లేనే లేదు. ఈ డబ్బంతా నేనే కూడబెట్టాననడం అతిశయంగా ఉండొచ్చు గానీ - చాలా భాగం నావల్ల పోగుపడిందే! నేను ఆర్జించిన డబ్బు నేను అనుభవించక పోవడం కన్నా అన్యాయ మేముంటుంది? ఏదో విధంగా ఈ ఎండాకాలం వెళ్ళేలోగా,

వాళ్ళిద్దరికీ ముడి పెట్టేస్తేనా, ఇహా కోటలో స్థిరపడిపోయినట్టే.

ఆ ఉద్దేశంతోనే ఇక్కడి కొచ్చాను. పరిస్థితులు ఇంకో లాగా ఉన్నాయి. వీడిచుట్టూ నానా చెత్తాకానీ రకం చేరారు. ఈ సజ్జంతా వాణ్ని ఆకాశాని కెత్తేస్తుంటే, ఈ చెవల వాజమ్మ అదంతా నిజమేనని భ్రమించి వెల్లకితలా పడిపోతు న్నాడు. ముందు వీణ్ణి ఈ మందలోంచి వేరుచెయ్యాలి. ఆ తర వాత సుభద్ర కిచ్చి ముడి పెట్టెయ్యాలి. ప్రస్తుతం నేనా ప్రయత్నంలో ఉన్నాను. భగవంతుడు ఏంచెయ్య దలిచాడో ఏమో తెలీదు.

## ●● రెండవ భూతం చెప్పిన కథ

నా పేరు లలితాంబ. ఆయన పేరు - సిగ్గెందుకులెండి? - పురు షోత్తం. పుర్రెతో పుట్టిన బుద్ధి పుడకలతో గానీ పోదని ఈ మనిషి కెంత చెప్పినా ఇంతే! ఆయనకు తోచనూ తోచదు. ఎదటి వారు చెబితే వినుపించుకోనూ వినిపించు కోడు. నే నేదన్నా ఒకటికి రెండు సార్లంటే 'నీకు తెలీదులే ఊరుకోవోయ్' అంటాడు. ఏదో సామెత చెబుతారే, కామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనపడుతుందని - అలా ఉంటుంది మా వారి పరిస్థితి. అదేం మనిషో, ఏమోగానీ, ఎంత సేపటికీ

ఆ గోతిలోనించి పైకి రాడు. గాను గెద్దులాగా గుండ్రంగా తిరుగుతూ ఉంటాడు. తిరిగిన దూరం, మైళ్ళకు మైళ్ళు ఉంటుందో. కానీ, జరిగిన దూరం అంగుళం కూడా ఉండదు. పైగా పేద్ద ప్లీడర్నంటాడు. కోర్టులో ఎలాంటి కేసునైనా తలకిందులు చేస్తానంటాడు. చేస్తే చేస్తారేమో గానీ - ఎబ్బే అస్తమానమూ అదే ధోరణయితే ఎలా?

ఓ క్లబ్బు లేదుగదా, సొసైటీ లేదుగదా పదిమందితో పరిచయం చేసుకోడం లేదుగదా! ఎప్పుడూ, ఆ కేసు లేమిటో, ఆ పార్టీ లేమిటో, డబ్బురంధేమిటో తప్ప - మిగతా ప్రపంచం ఆయనకు తెలీదు. ఆయన్ని వెన్ను కాచుకొని ఉండలేక నా నాళ్ళూ నరాలూ తెగిపోతున్నాయి.

మొన్న మట్టుకు మొన్న హరికేశవరావుగారు, ఎవరికో టీ పార్టీ ఇస్తూ ఇన్విటేషన్ పంపించారు. 'పోదా' మంటే 'ఎందుకు లెస్తూ' అంటాడు. 'ఈ లోగా ఈ కేసు సంగతేమిటో చూసుకొంటూగదా?' అంటాడు. అంతేగానీ, ఆ పార్టీకి వెళ్ళడం వల్ల, ఎంత లాభం ఉంటుందో ఆయనకు తెలీదు. చెప్పినా వినిపించుకోడాయె! ఎలా చచ్చేట్టు?

హరికేశవరావుగారంటే శాలాతోలి మనిషి కాడాయె! బోలెడంత పలుకుబడివున్న మనిషాయె! అటువంటివాడు, కారు మీదొచ్చి టీ పార్టీకి రమ్మనమంటే, ఎగిరిగంతేసి వొప్పుకొంటూరా జావగారిపోతారా మీరే చెప్పండి.?

ఆ పార్టీకి వెళ్ళడం ఎంత మంచిదయిందని? ఎంత మంది

పెద్దవాళ్ళు కనిపించారని? కాస్త ఆలస్యంగా వెళ్ళినా మనోహర్ గారి సీటుకు ఎదురుగ్గావున్న సీటు దొరికింది. నాకా సీటు దొరికిందని, రత్నాబాయికి ఒకటే ఏడుపు. దాని ఏడుపు చూస్తుంటే, నాకింకా ఏడిపించాలనిపించింది, చెప్పొద్దూ? అందుకని పనివున్నా లేక పోయినా, మనోహర్ గారి మాటల్లో కలగచేసుకొన్నాను. కలెక్టర్ గారిని స్మాల్ సేవింగ్స్‌ను గురించి అడిగాను. 'మీలాంటి వారంతా పూనుకోవాలమ్మా' అన్నారాయన. ఆ మొర్నాడేగదూ, వార్ని కలుసుకొని, ఐదు వేల రూపాయల బాండ్లూ కొన్నాను.

దానికో యజ్ఞం చేసినంత హడావుడి చేశారాయన. 'అనవసరంగా ఐదు వేలూ పోసి ఇవి కొనకపోతేనేం?' అంటాడు. నేనెందుక్కొన్నానో ఆయనకేం తెలుసు చెప్పండి? కలెక్టరు పిన్తల్లి రెండో కొడుకు బావమరిది ఎమ్మెస్సీ చదువుతున్నాట్ట! ఇంకా పెళ్ళి కాలేదుట! తండ్రి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరులో పనిచేస్తున్నాట్ట! రెండో మూడో మేడలున్నాయిట! 'పారిస్ బొమ్మలా ఉంటాడమ్మా' అన్నది భాగ్యాంబ. 'మీ పిల్లకు ఈడూ జోడూ బాగా ఉంటుంది. ఓసారి వెళ్ళి చూసిరండి' అని కూడా భాగ్యాంబగారన్నది. ఈ మనిషి కదలందే?

అసలు శకుంతలకు పెళ్ళి చెయ్యాలన్న ఉద్దేశమే ఆయనకున్నట్టు లేదు. నేనీమాట అన్నప్పుడల్లా 'మా కిష్టుడికేం తీపరమా'? అంటాడు. నా కంఠంలో ఊపిరుండగా,

శకూను, ఆ బ్రాష్టుడి కివ్వనిస్తానా? వందెకరాల పొలం ఉండం గానే సరా? నా కూతురు వెళ్ళి, ఆ పెంకుటింట్లో, వడ్ల బస్తాల మధ్యా గడిద గేదెల మధ్యా కాపరం చెయ్యాలా? గూళ్ళుపడిపోయ్యేలాగా ఇంటి చాకిరంతా చెయ్యాలా? దిక్కు మాలిన ఊళ్ళో సోడా కూడా దొరకదుగదా, నా తల్లిని అక్క డెలాఇవ్వనుచెప్పండి? మేనల్లుడైతే, పదివేలిచ్చుకోమనండి; నేను కాదన్ను. ఉద్యోగం వెలగ బెడతానంటే, హరికేశవరావు గారితో చెప్పి, మూడు నిమిషాల్లో వేయిస్తాను అంతేగాని పిల్లదాని గొంతు కోస్తానంటే ఎలా ?

ఈ మనిషితో, ఈ ముప్ఫయ్యేళ్ళనించీ ఎలా నెట్టు కొస్తున్నానో, నాకు తెలుసు; ఆ భగవంతుడికి తెలుసు. దాని చదువప్పుడూ అంతే పేచీ, 'కాపరం చేసే ఆడదానికి చదు వెందుకే నీ చాదస్తం గాకపోతే!' అన్నాడు. ఎంత బార్బ రస్ పెర్సనో చూడండి! నేనే పట్టు పట్టి కాలేజీలో చేర్పిం చాను. అదృష్టవశాత్తూ అమ్మడికి నా పోలికలు వచ్చాయి గనక సరిపోయింది; వాళ్ళ నాన్నలాంటి దయిందో - ఎప్పుడో గుండె కాస్తా ఆగిపోయి చచ్చి వుందును.

అసలు ఆయన చెప్పినట్టు వినేవాడయితే నాకీ బదవ లన్నీ ఎందుకు చెప్పండి? చిటికెన వేలిమీద చక్రాన్ని తిప్పక పోయానూ. అనకూడదు గానీ, అసలీయనగారికిన్ని కేసు లెలా వస్తున్నాయో, యేమో తెలుసా ? రాంమోహనరావు గారితో పరిచయం ఉండబట్టి. ఆయన నా ముఖంచూచి

కేసుల్ని పంపబట్టి గానీ లేకపోతే గోళ్ళు గిల్లుకొంటూ కూచో వలసిన మనిషి కాదూ? పైగా ఆయనతో పూసుకు తిరుగు తున్నానని గొణుగుతాడు. ఆ 'పిల్లదాన్ని కాస్తా పాడుచేస్తు న్నావే!' అంటాడు. నా కూతురు నాతో బాటు మీటింగు లకు, పార్టీలకు వస్తే తప్పేమిటట? ఎంత లేసి వాళ్ళతో పరి చయా లవుతాయి? అప్పటికప్పుడు ఋణాలమీద లాభాలుండ మంటే ఉండవేమో గానీ, దరిమిలా ఎంతకద్దు పనులన్నా చేయించుకోవచ్చు. ఆ ఆలోచనే ఈ మనిషికి లేదాయె!

మొన్నమట్టుకు మొన్న, శకుంతల ఆ అబ్బాయితో సినిమాకు వెళ్ళిందని, రెండు రోజులపాటు గొణుక్కున్నాడు. ఏం చెప్పమంటారు? అతనెవడో చవట సన్యాసయితే ఆయన గొణుక్కున్నా అర్థముంది. బంగారప్పిచ్చుకాయె. వాళ్ళ నాన్న బోలెడన్ని కంట్రాక్టులు చేస్తుంటాడు. లక్షలు ఏనాడో దాటిపోయాట్ట. హరికేశవరావుగారికి బాగా తెలుసునుట కూడాను. అటువంటి వాడితో సినిమాకెడితే తప్పేముంది? అయినా 'ఒకసారి భోజనానికి పిలుచుకురావే' అన్నాను. రేపో మాపో చెబుతానంది. నాతో బాటు పదిమందిలోకీ రాకపోకళ్ళు తెలిసింది గనక, శకుంతల అతన్ని పట్టుకో గలిగింది. దాని తెలివితేటలు చూస్తుంటే ఒక్కోసారి నాకే ఫిట్సు వొస్తాయేమో ననిపిస్తుంది. దానికి మూలావు చొర వుంది. వాళ్ళ నాన్న ఇంకా బిగపట్టి ఉంచబట్టి గానీ, లేక పోతేనా...

అది పుట్టంగానే, జమీందారు పెళ్ళామవుతుందన్నారు అంతా! దాని చక్కదనం అలాంటిది. ఎన్ని వేల మందిలో ఒక్కరికుంటుం దంటారు, దాని అందం! హరికేశవరావుగారు నాతో ఎన్నోసార్లన్నారు 'మరో పదేళ్ళు చిన్నవాణ్ణయితే మీ అమ్మాయిని బలవంతానైనా పెళ్ళాడి ఉందు' నని. అలా చెప్పుకొంటూ పోతే బోలెడన్ని! భగవంతుడి దయవల్ల ఈ ప్రసాదు సంబంధమే అయితే, అమ్మాయిని, ఆలిండియా ఫిగర్ ను చేసి పారేయనూ. అతనికి కట్టుకుపోయినంత డబ్బుం దిట. ఇక ఆలిండియా ఫిగర్ కాకేం చేస్తుందేమిటి? డబ్బుతో కొండమీది కోతిని దింపొచ్చు. కాలేజీ నించి వస్తూనే అతని దగ్గర కెళ్ళింది అమ్మడు. బహుశా ఇవ్వాళో రేపో, అతన్ని లాక్కొస్తుం దనుకొంటాను. ఇదేదో తేలిందాకా, నాకు నిద్ర పట్టడం లేదంటే నమ్మండి!

## ●●● మూడవ భూతం చెప్పిన కథ

నా పేరు శంకరం. బహుశా మీకు చాలా పరిచితుణ్ణయి ఉంటా ననుకొంటున్నాను. 'లంగాలో సింగరు మిషను' అన్న సాంఘిక చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టరుగా పని చేశాను. అంతకు ముందు నేను పని చేసిన మరో నాలుగు

సినిమాలు ఇంకా బయటికి రాలేదు. ఆ ప్రొడ్యూసర్లు పరమ చవటలు కావడంవల్ల, ఆ చిత్రాల్లో నేను చూపిన టెక్నిక్ బయ్టుటపడే అవకాశం లేకుండా పోయింది. అవే విడుదలై ఉన్నట్లయితే, ఈ పాటికి నేను ఆకాశంలో ఉండి ఉందును.

'లంగాలో సింగరు మిషను' చిత్రం వారం రోజులు తిరక్కుండానే మద్రాసు రావడానికి నేను కారణం కానే కాదు. అసలా కథే అలాంటిది. దాని రచయిత, ప్రొడ్యూసర్ని బాగా కాకాబట్టి బుట్టలో వేసుకొన్నాడు. డైరెక్టరు ప్రొడ్యూసరు చెప్పిందల్లా చేసి, తన డబ్బు ముందుగానే రొల్లు కొన్నాడు. పిక్చరు సగబడనన్నా కాలేదు, తెచ్చిన డబ్బంతా అయిపోయిందన్నాడు ప్రొడ్యూసరు. డబ్బివ్వందే షూటింగు లకు రానని హీరోయిను ఖరాఖండిగా చెప్పేసింది. అప్పుడు నేనే డిస్ట్రిబ్యూటర్సును పట్టుకుని బొమ్మను బైట పడేశాను. స్టూడియో అరువేయించాను. పోస్టర్లు అరువేయించాను. పబ్లిసిటీ అరువేయించాను. ఇంతా చేసినందుకు నాకు మిగిలిందల్లా, టైటిల్సులో పేరు పడటం, అదీ బ్రహ్మ ప్రళయమయి పోయింది.

కానీ, ఈ పిక్చరువల్ల నేను చాలా లాభించానను కోవచ్చు. ఫీల్డులో ఉన్న చిన్నా పెద్దలతో పరిచయమయింది. నే నెప్పటికన్నా సొంత పిక్చరు తీయడమంటూ జరిగితే, చాలా మంది నాతో కోఆపరేట్ చేస్తామన్నారు. ఊరికినే యాక్ట్ చేస్తామన్నవారు కూడా ఉన్నారు. అంతకుముందే

నా దగ్గర బోలెడంత తిని ఉన్నారు గనక, పత్రికలవాళ్ళు పబ్లిసిటీ కూడా ఫ్రీగా ఇస్తామన్నారు. ఇంక కావలసిందేమిటి గనక ? కథేదో నా దగ్గర ఉండనే వుంది. డైలాగ్సు నేనే రాసుకొంటాను. నలుగురు కవుల్ని పట్టుకొంటే, నాలుగు పాటలు ఎలాగూ దొరుకుతాయి.

చాలా మంది 'ప్రజలు ప్రజలు' అంటారు గానీ, దానికి బొత్తిగా అర్థం లేదంటాను. ప్రజదేముందండీ; ఏది చెబితే అది వింటారు. ఏది చూపిస్తే అది చూస్తారు. దిక్కుమాలిన ఆశయాలేవో పెట్టుకొని నష్టపోవడమన్న ప్రసక్తే లేదు. లక్షలు బెట్టి సినిమా తీయడం, లక్షలు సంపాదించడానిగ్గానీ, జనాన్ని ఉద్ధరించడానిక్కాదు. ఆ పని చెయ్యడానికి రాజకీయ నాయకులున్నారు. వాళ్ళ గోడవేదో వాళ్ళను పడనివ్వండి. మధ్యలో సినిమా నెత్తికి ఈ బరువెందుకా అని ?

పాత ముఖాలతో జనం విసిగిపోయారన్న సంగతి నాకెప్పుడో తెలుసు. కానీ, ఈ ప్రొడ్యూసర్లు వాళ్ళని వదలరు. వదిత్తే డబ్బు రాదని వాళ్ళ భయం. ఈ భయానికి అర్థం లేదంటాను. కథలో టెంపో ఉండాలే గానీ, పరమ కొత్త ముఖాల్ని తెచ్చి, లక్షలు కక్కించొచ్చు. అంతా డైరెక్టు చెయ్యడంలో ఉంది. నేనయినా, మరీ అంత సాహసం చెయ్యాలనుకోవడం లేదు. మొత్తం పిక్చరులో ఆరుగురు హీరోలు, పన్నెండు మంది హీరోయిన్లనూ పెట్టి అందులో సగం మంది హీరోయిన్లను, ఇంటర్వల్ దాటకుండానే దాటించేసి, మిగతా

ఆరుగురితోనూ, చివరి సీన్లు లాగించేస్తాను. ఇంతమంది హీరో యిన్లేమిటని మీరడక్కండి. నా పిక్చరులో అంతమందీ ఉండ వలసిందే! అదే దాంట్లో ఉన్న నావెల్టీ. వీరందర్నీ పాత వారినే పెట్టటం నా కిష్టం లేదు. సగం మంది కొత్తవాళ్ళను- టాలెంటెడ్ పీపుల్‌ను- తెరకు పరిచయం చేయాలనుకొంటు న్నాను. ఆంధ్రుల్లో ఉన్న కళాపిపాస నాకు తెలియంది కాదు గనుక, కొత్తవారు దొరక రేమోనన్న భయం నాకు లేనే లేదు. ఎందుకైనా మంచిదని నా ప్రోగ్రాం ముందుగానే పత్రికల్లో వేయించాను. చిత్ర మేమిటంటే, నే ననుకొన్న దానికన్నా రెస్పాన్సు బ్రహ్మాండంగా ఉంది. రెండు రోజు లుండాలను కొన్నచోట,వారం రోజులదాకా ఉండాలిసొస్తోంది. వీళ్ళందరూ తెరకు పనికొస్తారని కాదు గానీ, వీరిలో ఉన్న ఉత్సాహాన్ని తక్కువ అంచనా వేయడానికీ లేదు.

ముందుగా నన్ను నిరుత్సాహ పరచినవారు చాలా మంది ఉన్నారు. 'కొత్తవాళ్ళతో ఎక్కడ తంటాలు పడతావు భాయీ! పది డబ్బులు పోతేపోయినై గానీ, పాతవాళ్ళతో దంచెయ్యరాదూ?' అని చాలా మంది నాకు సలహా లిచ్చారు. వాళ్ళకు నా దొక్కటే సమాధానం! ఎన్ని లక్షలు గుమ్మ రించినా శకుంతల వంటి బ్యూటీని వాళ్ళు మద్రాసులో చస్తే పట్టుకు రాలేరు. శకుంతలను చూశాక, నా కథలో కూడా చాలా మార్పులు చేయాలనుకొన్నాను. ఇంత మంది హీరో యిన్లను పెట్టకుండా, శకుంతలనే హీరోయిన్‌గా చేసిపారేసి

నేను హీరో వేషం వేదామనిపించింది. కానీ మార్కెట్ పరి స్థితి చూస్తే, ఇదాట్టే మంచిది కాదేమోనన్న అనుమానం వేసింది !

ఆవిణ్ణు చూస్తూనే 'నిన్ను బుక్ చేశాను' అనాలని పించింది. అటువంటి పిల్లను మొదటి సారిగా సినిమా పరిశ్ర మకు పరిచయం చేసిన క్రెడిట్ నాకే దక్కుతుం దనడంలో ఢోకా లేదు. ఆవిడ స్టిల్సు తీసి పది పత్రికల్లో వేయింతా మంటే, శకుంతల వొప్పుకోంది కాదు. 'ఇప్పుడప్పుడే దేనికి లెస్తురూ ?' అన్నది. ఆలోచించాక ఆ మాటా నిజమే ననిపించింది. చచ్చీ చెడీ నేను డిస్కవర్ చేసిన ఈ టాలెంట్ను కాస్తా, ఇంకెవడన్నా ఇట్టే ఎగరేసుకు పోయినా పోవచ్చు. నాయనా ! బ్యూటీ ప్లస్ టాలెంట్ ఎవరికి మాత్రం చేదవు తుందంటావ్ ?

సినిమా యాక్షన్ గురించి నాకు తెలిసిందంతా చెప్ప డమే కాకుండా, ప్రత్యక్షంగా చూపించడం కోసం నాతో బాటు సినిమాలకు తీసుకెళ్ళాను. పార్కుకు తీసుకెళ్ళాను. డైలాగ్ డెలివరీలో నట్లు పోకుండా ఉండటంకోసం గంటల గ్గంటలు మాట్లాడుతూ కూచున్నాను. లవ్ సీన్సప్పుడు, లవ్ డైలాగ్సు డెలివరీ అప్పుడు సిగ్గుపడి షూటింగులన్నీ ఖరాబు చేస్తుందేమోనని, వాటిల్లోనూ అంతో ఇంతో తర్ఫీదిచ్చాను. ఈ పరీక్షలన్నీ శకుంతల ఇట్టే గడిచి పోయింది.

ఈవిడ స్టిల్సు చూసి డిస్ట్రిబ్యూటర్స్ ఎగపడతారన

డంలో నా కెటువంటి అనుమానమూ లేదు. కానీ, ముందుగా వాళ్ళదగ్గర డబ్బు తీసుకొన్నామంటే ఆర్పి పారేస్తారు. వారిష్టమొచ్చినట్టు చిత్రాన్ని మార్చమంటారు. అలా మార్చడమంటూ జరిగితే, తయారయ్యే పిక్చరు, నేననుకొన్న దానిలాగా ఉంటుందన్న నమ్మకం నాకు లేదు. అందుకనే పిక్చరు మొత్తం స్వంతంగా తీయడమే మంచిదనిపించింది. నీ మీద ఆర్థికంగా ఆధారపడనివాణ్ణి, నువ్వు ఏనాడూ శాసించ లేవనుకో.

నన్నడిగితే, డబ్బు చెయ్యడం ఓ గొప్ప ఆర్టంటాను. కొంత మంది చాలా ఆర్టిస్టిక్‌గా డబ్బు చేసుకొంటారు. కొంత మంది పద్ధతులు చాలా ప్రిమిటివ్‌గా ఉంటాయి. అర్ధ రూపాయి డబ్బులిచ్చి అర్ధ రాత్రిదాకా పని చేయించడం ప్రిమిటివ్ లక్షణం కాక మరేమిటి చెప్పండి ?

కేవలం హీరోయిన్ల కోసమనే నేను బయలుదేరినా, తెలిసో తెలియకో చాలా మంది కుర్రవాళ్ళు కూడా ఇంటర్వ్యూ కొచ్చారు. ఇలా రావడం కొంత మేలే అయింది. ఇప్పుడు నా ఆర్థిక సమస్యను సగబడదీర్చిన ప్రసాద్ అలా వచ్చినవాడే ! అతని నాన్నకు ఏవో బిజినెస్ లున్నాయట. లక్షాలు గడిస్తుంటాడని తెలిసింది. పైగా ఒక్కడే కొడు కట. ఇటువంటివాడు చేతిలో ఉంటే, నెలకు మూడు పిక్చర్లు లాగి అవతల పారేయడం ఓ లెఖ్కలోది కానేకాదు. అతనికి సినిమా ఇండస్ట్రీ ఎలాంటిదో చెప్పాను. వేలు గుమ్మరించి

లక్షలు పిండుకోవాలంటే ఇంతకన్నా మంచి బిజినెస్ ఉండదన్నాను. గ్లామరస్ లైఫ్ ఎంజాయ్ చెయ్యదలచిన వాడికి ఇది తప్ప మరో ఫీల్డు లేదన్నాను. "గోపాలకిష్టుడు లాగా పదహారు వేల మంది గోపికలతో కులాసాగా ఉండవయ్యా!" అన్నాను. ఈ మాట విని, ఫక్కున నవ్వాడతను.

అతని ధోరణి చూస్తూంటే, ఆడదాన్ని చూసి వెర్రెత్తిపోయే బాపతని నా కనిపించింది. ఒక చెంప నాతో మాట్లాడుతూనే ఉన్నాడు, మరో చెంప శకుంతలను దొంగ చూపులు చూస్తూనే ఉన్నాడు. ఇవేమీ నాకు తెలియవని అతని నమ్మకం! చావనీండి నాకెందుకొచ్చింది గానీ, నా సినిమాకు నాలుగు డబ్బులు పెడితే చాలు. ఆ తరువాత, ఆ శకుంతలా, వాడూ, ఏ గంగలో దూకినా నా కభ్యంతరం లేదు.

చిక్కేమిటంటే, శకుంతలకు అతనంటే ఆపేక్ష ఉన్నట్టు లేదు. వాడు ఎదురుగ్గా ఉన్నంతసేపూ, చచ్చేట్టు కులికిన గుంట, వాడటు తిరగ్గానే, "ఇదేమిటండీ, అలా వెర్రాడిలా చూస్తాడేం" అంటుంది. చూస్తే దీని సొమ్మేం పోయిందట! వాణ్ణి కాస్త మంచి చేసుకుంటే, పిక్చర్ తొరగా ఫినిష్ చెయ్యొచ్చు. ముద్దొచ్చినప్పుడే చంకనెక్కాలి. వాడు మోజులో ఉన్నప్పుడే, పని కాగొట్టుకొంటే సరి. ఈ మాటే శకుంతలతో చెప్పాను. ఆవిడ చాలాసేపు ఆలోచించింది. "నా వల్ల కాదండీ!" అన్నది. "ఎలానండీ బాబూ?" అన్నది. ఎలా చెయ్యాలో, ఏం చెయ్యాలో ఆవిడకి, నసాళం

అంటేటట్టు బోధపరచాను. "అతగాడు చేతబడితేనే మన ఆటలు సాగుతాయి. ముందా సంగతేదో చూడు" అని గట్టిగా కోప్పడ్డాను. ఏమనుకొందో ఏమిటో గానీ, "సరే" నన్నది చివరకి. గుండెలు తేలికిచ్చినట్లయింది నాకు. నా కున్న రెండు సమస్యలూ తీరిపోయాయి. బ్రహ్మాండమైన బ్యూటీని డిస్కవరీ చేయడమే కాకుండా, ఆ డిస్కవరీ చేత మరో డబ్బున్న పిచ్చికను డిస్కవరీ చేయించాను. ఈ వెధవను కాస్తా చేత చిక్కించుకొన్నానో, మెడ్రాస్ సినీ ఫీల్డును ఓ ఊపు ఊపి పారేశానన్నమాటే.

## ●●●● నాలుగవ భూతం చెప్పిన కథ

నా పేరు శకుంతల. మా అమ్మ పేరు లలితాంబ. మానాన్న పేరు చెప్పినా మీరు తెలుసుకోలేరు — కనక చెప్పడం అనవసరమే ననుకొంటాను. అదీగాక- మా నాన్న పరమ చాదస్తుడు. నేనన్నా, నా చదువన్నా ఆయనకంత సదభిప్రాయం ఏనాడూ లేదు. చదువుకొన్న ఆడది చెడిపోతుం దంటాడాయన. అటువంటివాడి కడుపున పుట్టినందుకు నేనెంత పశ్చాత్తాప పడాలో మీరే చెప్పండి?

మా అమ్మ దోవవేరు. ఆమెగారే లేకపోతే - నేనెలా

ఉండేదాన్నో ఊహించుకోవటానికే భయం వేస్తుంది. పది మందిలోకి వెళ్ళనూగలదు; పదిమందిని ఇంటికి తీసుకురానూ గలదు. అభిప్రాయాల్లోనూ, అభిరుచుల్లోనూ మా నాన్నా అమ్మలకు పొద్దెదురయినా, వాళ్ళెప్పుడు కీచులాడుకున్నట్టు కూడా లేదు. ఎవరి జీవితం వారు జీవిస్తున్నారు. ఒకరి విష యాల్లో మరొకరు జోక్యం కలగచేసుకోరు. నా దృష్టిలో ఇది ఆదర్శ దాంపత్యం.

తప్పో వొప్పో, పెళ్ళిని గురించి నాకొన్ని అభి ప్రాయా లున్నాయి. అన్నిటికి సరిపోయినవాడు తటస్థపడి నప్పుడే పెళ్ళాడుదా మనుకొంటున్నాను. అదృష్టవశాత్తూ దీన్ని గురించి నన్ను బలవంతం చేస్తున్న వారెవరూ లేరు. మా నాన్న, ఆయన మేనల్లుణ్ణి చేసుకొంటే బావుంటుందంటాడు. కిష్టుడు బావకు బోలెడంత ఆస్తి ఉన్నమాట నిజమే! వందెక రాలుగావును పల్లపు భూము లున్నాయి. రెండు పనసతోట లున్నాయి. గాంధీ పార్కంత ఇల్లు ఉంది. కానీ, ఇవేమీ నన్ను ఇన్స్పైయిర్ చేయడం లేదు. కిష్టమూర్తిని చూస్తుంటే, ఈ శతాబ్దం మనిషిలా ఉండడు. ఇప్పటికీ చాకింటి చలవ పంచలు కడతాడు. చుట్ట కాలుస్తాడు. పొద్దుటే చద్దన్నం తింటాడు. పేపరు చదవడు. నవలలు చదవడు. సినిమాలు చూడడు. ఆయన దృష్టిలో రామతిలకం గొప్ప నటి. జొన్నవిత్తుల శేష గిరిరావు గొప్ప పాటగాడు. 'భయంకర నారీపిశాచి' గొప్ప డిటెక్టివ్ నవలంటాడు. ఈ లోగా వచ్చిన మార్పులు ఆయన్ను

అంటలేదు. ఈ మార్పులేవీ ఆయనకు గిట్టవు. మాటిమాటికీ 'పిదపకాలం పిదపకాలం' అంటుంటాడు. అటువంటివాణ్ని చేసుకొని సుఖపడతానని మా నాన్న నమ్మిక. ఒకసారి మా నాన్నతో ఈ సంగతి కుండపగలేసి చెప్పాను కూడాను

"పోనీ బావను బస్తీలో కాపరం పెట్టమను. అలానే చేసుకుంటాను" అనికూడా అన్నాను.

"అయితే మాత్రం, ఆ జంగిల్ పెర్సన్‌తో నువ్వెలా ఉండగలవే నాతల్లీ ? నువ్వు చేసుకొంటానంటే మాత్రం నేనొప్పుకోవద్దా ? కిష్టుణ్ని చేసుకొంటానంటే నేనిప్పుడే సైనేడ్ తాగి చచ్చిపోతాను" అన్నది మా అమ్మ.

"అలా జరిగినా బాగుండిపోను" అన్నాడు మానాన్న.

అన్నంత పనీ అమ్మ చేస్తుందని కాదుగానీ, నాకూ నాన్నగారి ప్రపోజల్ ఇష్టంలేదు గనక, అమ్మ మాటను గౌరవించాలన్న వంకతో, నాన్నను కాదన్నాను. అదృష్టవశాత్తూ నాన్న కూడా అట్టే పట్టుబట్ట లేదు.

నా పెళ్ళిని గురించి నాకు లేని దిగులు మా అమ్మ కుండటం చూస్తే ఒక్కొక్కసారి చాలా విచారం కలుగుతుండేది. నా సుఖం అమ్మ చూడలేదనడం న్యాయం కాదుగానీ, అంత కన్నా ముఖ్యం ఆమె అల్లుడు చాలా గొప్పవాడయి ఉండటం. ఆమె దృష్టిలో గొప్పగా ఉన్నవాడు, నాకూ గొప్పగానే ఉంటాడని ఆవిడ నమ్మకం. తీరా చూస్తే ఏయే గొప్పలు అమ్మకు నచ్చుతాయో ఎవ్వరూ చెప్పలేరు. మొన్న

మొన్నటిదాకా, కలెక్టరుగారి పింతల్లి రెండో కొడుకు బావ మరిది; అమ్మకు గొప్పవాడుగా కనిపించాడు. అతన్ని నాలుగు సార్లు పార్టీలకు పిలిచింది. మరో రెండు సార్లు నన్ను వెంట పెట్టుకుని అతనింటికెళ్ళింది. అతన్నీ నన్నూ వొంటరిగా విడిచి పెట్టి తను మెల్లిగా జారుకొంది. మమ్మల్ని సినిమాలకు పంపించింది. పార్కులకు వెళ్ళనిచ్చింది. అతనితో చనువుగా ఉండమంది. పూసుకు తిరగమంది. అమ్మ ఉద్దేశ ప్రకారం నేను మురళిని ఆకట్టుకొని, అతని చేత పెళ్ళికి వాగ్దానం చేయించుకోవాలి. మురళి మంచివాడే! కానీ, అతనికి ఆడవాళ్ళతో మాట్లాడటమంటే వల్లమాలిన సిగ్గు. ఇంతవరకూ చలంగారి పుస్తకాలు చదవలేదట. నేనే పట్టు కెళ్ళి పది ఇచ్చాను. వారం తరవాత అడిగితే, నాలుగు మాత్రమే చదివాననీ, ప్రస్తుతం తనకు చదివే తీరిక లేదనీ అన్నాడు. అయినా చూదామని, అతను చదివిన పుస్తకాలను గురించి అభిప్రాయమడిగాను. చప్పరించేశాడు. అందులోని అభిప్రాయాలు తనకు బొత్తిగా గిట్టవన్నాడు. 'ఆడవాళ్ళూ మగవాళ్ళూ అలా ఇష్టం వచ్చినట్టు తిరిగితే సంఘం మట్టిగలిసి పోదా' అన్నాడు. అటువంటి వాణ్ని పెళ్ళి చేసుకొనే ప్రమాదం తప్పినందుకు చాలా సంతోషించాను.

పెళ్ళి కావడమే ముఖ్యమయితే, నా చుట్టూ ముసిరే మందలోంచి ఎవణ్నో వొకణ్ని ఎప్పుడో పెళ్ళాడి ఉందును. పెళ్ళివల్ల నా ఉద్దేశాలూ, అభిరుచులూ దెబ్బతినడం నా కిష్టం

లేదు నా అభిరుచుల పట్ల గౌరవం లేనివాడితో నే నేనాడూ కలిసి ఉండలేను. నా ఆలోచనలే నిజమయి, నేను రేపు ఏ సినిమాలోనో వేషాలు వేస్తానంటే, అందుకు వొప్పుకోనివాణ్ణి నేను పెళ్ళాడి మాత్రం లాభ మేముంది ? సినిమాల్లో వేషాలు వేయాలన్న కోర్కె ఈ నాటిది కాదు. ఈ కోర్కె చచ్చిపోకుండా నీరు పోసిన వాడు శంకరం.

శంకరం నన్ను చూస్తూనే మెచ్చుకున్నాడు. ఎవరితోటీ పది నిమిషాలన్నా మాట్లాడనివాడు, నాతో అరగంట కబుర్లాడాడు. తను తీయబోయే పిక్చర్‌లో హీరోయిన్ వేషం వెయ్యమన్నాడు. ఈ సంగతి అమ్మతో చెప్పినప్పుడు బ్రహ్మానందం అనుభవించింది.

"నేను మొదణ్నించీ అనుకుంటూనే ఉన్నానే తల్లీ ! ఒక్క పిక్చర్ బైటికొస్తే, నువ్వింక కోహినూర్‌లా వెలిగిపోవులే !" అన్నది అమ్మ.

ఆ నమ్మకం నాకూ ఉంది. ఏదో విధంగా, ఒక్క సినిమాలో ఛాన్సు దొరికితే చాలు; ఆ తరవాత, నా ప్రయత్నం అవసరం లేకుండానే బుకింగ్సు దొరుకుతాయి. ఆ వొక్క ఛాన్సూ శంకరం ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. శంకరంమీద నాకెలాంటి అభిప్రాయమూ లేదు. అథవా వుంటే, అంతో ఇంతో అసహ్యం మాత్రమే ఉంది. ఎర్ర తోలు కనపడితే, తలనిలో ఎక్కడలేని వికారమూ పొర్లుకొస్తుంది. నేనే మనుకొంటానో నన్న ఆలోచన కూడా లేకుండా, నాతో బూతు

మాటలు అనేవాడు. బూతు అర్థాలొచ్చే మాటలు అనిపించే వాడు. సినిమాలకు తీసికెళ్ళేవాడు. సినిమా చూస్తున్నంత సేపూ, అందులోని డైలాగ్సును గురించీ, పాట్సును గురించీ చెబుతుండేవాడు. అనేకసార్లు. నా చేతిని ముట్టుకొనీ, నా భుజంమీద చెయ్యివేసి మాట్లాడేవాడు. లోపల అసహ్యమంటూ ఉన్నా బయటకు కనపడనిచ్చేదాన్ని కాదు. ఎందు కంటే, నా భవిష్యత్తంతా శంకరంగాడి చేతుల్లో ఉంది. నా కోసం గాకపోయినా, వాడి బ్రతుకుతెరువు కోసమయినా సినిమా తియ్యక తప్పదు. క్రిములు మురుగు లేనిదే బ్రతకలేనట్లు, శంకరంగాడి లాంటివాళ్ళు సినిమాలు లేకపోతే బ్రతకలేరు. అటువంటి వాడితో విరోధం పెట్టుకొని బావుకొనేది మాత్రం ఏముంది ? రేపు ఆ ఫీల్డులో కాస్త ఆధారం దొరికాక నేను మాత్రం వీడి ముఖం చూడబొయ్యాను గనకనా ? పైత్యకారి వెధవ గనక, కాస్త ఎక్కువ చనువు తీసుకొంటున్నాడని సరిపెట్టుకొన్నాను. ఎందుకైనా మంచిదని అమ్మతో కూడా ఓ మాట చెవినేసి ఉంచాను. అమ్మ నవ్వి ఊరుకొంది.

ప్రసాద్ కనిపించకపోతే ఏమయ్యేదో చెప్పలేను గానీ, అతన్ని చూశాక నా పథకమంతా మార్చుకోవలసి వచ్చింది. అతగాడు ఈ తిక్క శంకరం కోసమొచ్చాడు. అతన్ని చూస్తూనే లక్షాధికారుల బిడ్డడని తెలిసిపోయింది. చేతికి బంగారపు గడియారముంది. జేబులో వంద రూపాయల నోట్ల కట్ట ఉంది.

శంకరం అతనితో కోస్తున్నాడు. సినిమా పరిశ్రమ ఇచ్చినంత లాభాలు మరే పరిశ్రమా ఇవ్వదన్నాడు. ప్రొడ్యూసర్ గా వచ్చిన వాడికి మందీమార్బలం లోటంటూ ఎప్పుడూ ఉండదన్నాడు. మామూలు జనం, ఆకాశంలో ఉంటారనుకొనే స్టార్లు, బుకింగ్సు కోసం నీ చుట్టూ మూగుతారన్నాడు. ఇవన్నీ ప్రసాద్ వింటున్నాడని నాకు తోచలేదు. అవతల ఊఁ కొడుతూనే, నన్ను మింగేటట్టు చూస్తున్నాడు. ఆ చూపులు నన్ను తడువుకున్నట్టు ఫీలయ్యాను. అతన్ని నిరుత్సాహపరచడం భావ్యం కాదనిపించింది. నేనూ సంభాషణలో జోక్యం కలగజేసుకొన్నాను.

రాను రాను ప్రసాద్ రాకపోకలు ఎక్కువగా సాగాయి. అతను శంకరంతో మాట్లాడాలని రావడం వొక వంకగా మాత్రమే పనికొచ్చేది. శంకరం అక్కడున్నా, అతను నాకేసి తిరిగి కబుర్లాడుతూ ఉండేవాడు. ఈ ఇద్దరి మధ్యా నేను నలిగిపోవలసి వచ్చింది. ఏమంటే, శంకరం ఏమనుకొంటాడేమోనని మరో భయం! ఇహముందెప్పుడో చూపించాల్సిన నటనంతా, ఈ ఇద్దరి ముందూ చూపించాలి సొచ్చింది.

అయితే ఈ బెడద ఎక్కువ కాలం పడనవసరం లేకపోయింది. శంకరం, స్వయంగా పిలిచి, ప్రసాద్ తో కాస్తంత చనువుగా ఉండమన్నాడు. అతని చేత పెట్టుబడి పెట్టించితే వెంటనే ప్రొడక్షన్ ప్రారంభించవచ్చునన్నాడు. అతన్ని మంచి చేసుకోమన్నాడు. ఈ సలహా నాకు బ్రహ్మాండంగా

నచ్చింది. దీన్ని అక్షరాలా ఆచరణలో పెట్టా లనుకొన్నాను. అయితే శంకరం ఆశించిన విధంగా మాత్రం కాదు. శంకరం గాడు, తన అవసరం కోసం, ప్రసాదును మంచి చేసుకో మన్నాడు. నేను నా అవసరాలకు గాను, అతన్ని మంచి చేసుకోవా లనుకొన్నాను. ప్రసాద్ లాంటివాడు చేతిలో ఉంటే, అతని చేతనే పది సినిమాలు తీయించొచ్చు. అప్పుడీ బోడి శంకరంతో నాకు అవసరమే ఉండదు. ఇటువంటి వాళ్ళను వంద మందిని నేనే పనికి పెట్టుకోవచ్చు. ఈ ఉద్దేశం తోనే, నేను ప్రసాదుతో ఖత్తు కలిపాను. అతన్ని మా ఇంటికి తీసుకెళ్ళాను. అమ్మకు పరిచయం చేశాను. నాన్నకు చూపిం చాను. అమ్మ అతని ఆస్థి వివరాలన్నీ కనుక్కొంది. దాంతో ఆవిడకు ప్రసాద్ మీద ఎక్కడలేని గౌరవమూ ఏర్పడిపోయింది. ఇప్పుడు మేమిద్దరం కలిసి తిరుగుతున్నాం. దీన్ని చూసి శంక రంగాడు ఏడ్చిపోతున్నాడు. 'నా సంగతి చెప్పవే' మంటాడు. ఏమిటి చెప్పాలిట ? రేపో మాపో మేమిద్దరం పెళ్ళాడ బోతున్నామనీ, ఆ తరవాత గానీ, సినిమాల గొడవ ఆలో చించమనీ చెప్పాను. శంకరం లబ్బు మని మొత్తుకొన్నాడు. ఏడవనీ వెధవను. ఎవడికిట ఇక్కడ జాలి ?

## ఐదవ భూతం చెప్పిన కథ

నా పేరు పురుషోత్తం. మా అమ్మాయి పేరు శకుంతల. నేను ప్లీడర్ని. నా చిన్నతనంలో మా నాన్న నీళ్ళ కావిళ్ళు మోశాడు. మా అమ్మ పెద్ద పెద్దవారి ఇళ్ళల్లో వంటపని చేసేది. నేను వారాలు చెప్పుకొని చదువుకొన్నాను. దరిద్రమంటే ఏమిటో నాకు తెలుసు. పిడికెడు మెతుకులు లేకుండా రోజులకు రోజులు పస్తులున్నాను. పుస్తకాలు కొనడానికి డబ్బు లేక, తోటి వారిని అరువడిగి పుచ్చుకొన్నాను. రైల్వే స్టేషనుల్లో నిద్రపోయాను. భగవంతుడి దయవల్ల ఈ నాడింత ఆర్జించ గలుగుతున్నాను.

మనిషికి ఆర్థిక దృష్టి ఉండకూడదని నే నెపుడూ అనను. కానీ డబ్బే ప్రధానమని, నే నిప్పటికీ నమ్మలేక పోతున్నాను. డబ్బును మించిన విలువలు చాలా ఉన్నాయని నా నమ్మకం. ఆ విలువలు సాధించడానికి, డబ్బు ఉండటం లేకపోవడమన్న సమస్య అడ్డు రానేరాదు. కొంత మంది డబ్బుకోసం దారుణంగా హత్యలు చేయడం నాకు తెలుసు. మనిషికీ మనిషికీ ఉండే సంబంధాలను ఈ డబ్బు ఎంత అధ్వాన్నంగా మారుస్తుందో నేను అనుభవం మీద తెలుసుకో గలిగాను.

మా ఆవిడ దృష్టి వేరు. పుష్కలంగా డబ్బున్నవారికి దాని విలువ తెలియదనడం, మా ఆవిడ పట్ల అక్షరాలా రుజు వవుతుంది. అది నీళ్ళవతుగా డబ్బును వాడేస్తుంది. వంద రూపాయలకూ, రూపాయకూ, మా ఆవిడ దృష్టిలో భేదం లేదు. బొత్తిగా ఆర్థిక దృష్టి లేకపోవడమూ, అస్తమానమూ డబ్బుకోసం పాకులాడడమూ తప్పే ననుకొంటాను. సుఖంగా జీవించడానికెక్కావలసిన మేరకు, ప్రతి వాడికీ డబ్బుండవల సిందే! అవసరాలు మించిపోయేటంత ఉన్నప్పుడే అపర బుద్ధు లన్నీ పుట్టుకొస్తుంటాయి.

నా అనుభవంలో అనేక మంది భాగ్యవంతులను చూశాను. నా ఖాతాదారుల్లో జమీందార్లున్నారు; లక్షాధి కార్లున్నారు; బాంకర్లున్నారు. వారిని చూస్తుంటే, నాకు ఒక్కొక్కసారి చాలా భయం పుట్టుకొస్తుంది. నిద్రాహారాలు మాని, వ్యవహారాల్లో వారు మునిగిపోవడం నాకు తెలుసు. లక్షలాది సమస్యలతో తల్లడిల్లిపోవడం నాకు తెలుసు. ఈ గిజాటు నుండి తప్పుకోవడానికి తాగుడుకు అలవాటుపడిన వాళ్ళూ, ఆడవాళ్ళ వెంట పడినవాళ్ళూ నాకు తెలుసు. నేను చూస్తుండగానే సర్వనాశన మయిపోయినవారు చాలా మంది ఉన్నారు. వారి పిల్లలు ఈనాడు పత్రికాసుల్లా తిరుగు తున్నారు.

ధనవంతుల వ్యక్తిగత జీవితంలో ప్రశాంతతకు చోటు ఉండదని నా నమ్మకం. ఇచ్చిన డబ్బు రాదనో, వచ్చిన

డబ్బు ఉండదనో, ఎప్పుడూ దిగులు పడుతూనే ఉంటారు. అదీ గాక డబ్బున్నవారి చుట్టూ మనుషులు ఈగలు ముసిరినట్టు ముష్కురుతారు. వీరిలో ఎవరు హితులో, ఎవరు కాదో తేల్చుకోవడం కష్టం. నిజం చెబితే ఏం కొంప మునుగుతుందోనని అతనికి ఇష్టమైన కబుర్లే చెబుతుంటాడు. అందువల్ల అవతలివాడికి, తాను చెప్పిందే సత్యమయినట్టూ, అది తప్ప మిగతాదంతా అసత్యమయినట్టూ ఒక భ్రమ కలుగుతుంది. వ్యక్తి నాశనం కావడానికి ఈ భ్రమ పునాదిరాయి వంటిది. ఈ సంగతులన్నీ నాకు తెలుసు గనకనే, శకుంతలను మా కిష్టుడికిద్దామనుకొన్నాను. ముందు మా ఆవిడ వొప్పుకోలేదు; ఆ తరవాత శకుంతల వొప్పుకోలేదు. ఎదటి వారి అనుభవం నుంచి నువ్వు నేర్చుకోకపోతే గిడసబారి పోతావు. నాశనమయి పోతావు!

జాగ్రత్త !!

ప్రసాదును చేసుకోడానికి శకుంతల వొప్పుకొంది. మా ఆవిడా వొప్పుకొంది. నన్నెళ్ళి వొక్కసారి మాట్లాడిరమ్మంది. మాట్లాడక పోయినా ఈ పెళ్ళి జరగడం ఖాయమన్నది. కేవలము మర్యాదకోసమే పంపుతున్నా నన్నది. ఇన్ని మాటలు ఆవిడ చెప్పాక వెళ్ళకపోవడం నాకే బాగనిపించలేదు. అందుకనే ప్రసాదును చూదామని వెళ్ళాను.

నే వెళ్ళేసరికి, అతను పుట్టెడు దుఃఖంలో ఉన్నాడు. టేబిల్ మీద టెలిగ్రాం ఉంది. అతని మేనమామ గావును–

విచారమూ కాకుండా, కసితీర్చుకోవడమూ కాకుండా మాట్లాడుతున్నాడు. వాళ్ళ ఫాక్టరీలలో అగ్నిప్రమాదం జరిగిందట. మొత్తం బూడిదయిపోయిందట. ఈ మధ్యనే మేడలు తాకట్టు పెట్టి కొత్తగా మరో గుడ్డల మిల్లు కట్టారుట. అది కూడా తగలబడి పోయిందట. కాంట్రాక్టుల్లో కూడా నష్టం వచ్చిందట. బికారులయి పోయ్యారుట.

"పోకేం చేస్తారు బాబూ ? కావటానికి మా బావగారే అయినా మహా కర్కోటకుడు లెండి. బాగా ఉన్న రోజుల్లో మమ్మల్ని పురుగుల్ని చూసినట్టు చూశాడు. మా ఉసురు తగలకుండా పోతుందా ? భగవంతుడు గంపంత కంటితో చూడడుటండీ ?" అన్నాడాయన, పెట్టె బేడా సర్దుకొంటూ.

ప్రసాదు మాత్రం ఏమీ మాట్లాడలేదు. గుడ్లనీరు గుడ్లలోనేకుక్కుకొంటూ కూచుండి పోయాడు.

"సరే నేను వెడుతున్నారా ?" అంటూనే ఆయన వెళ్ళిపోయాడు. ప్రసాదు ఉండమన్నా ఉండలేదు.

"ఇంతకాలం మీకు చేసీచేసీ రెక్కలు విరుచుకొన్నాను. బూడిద మిగిలింది. ఇక ఇప్పుడన్నా నా బతుకేదో బతకనివ్వండి. ఎంతకాలమని మీకు చేస్తూ కూచునేది ? నాకూ అవతల పెళ్ళాం బిడ్డలున్నారు. వాళ్ళ గతేంకాను ?" అన్నాడాయన పోతూ పోతూ.

"నువ్వేం చెయ్యదలిచావ్ ?" వని అడిగాను. ప్రసాదు

ముందు కొంతసేపేమీ మాట్లాడలేదు. చదువు మానుకోక తప్ప దన్నాడు. ఎక్కడన్నా ఉద్యోగం చేసుకొంటానన్నాడు. అతనికి తెలిసిన వాళ్ళు చాలా మంది ఉన్నారుట. వారిలో ఎవరన్నా తన కీ మాత్రం ఉపకారం చెయ్యక పోరని కూడా అత నన్నాడు.

ఈ పరిస్థితిలో అతనితో పెళ్ళి ప్రస్తావన ఎలా తీసుకు రాను చెప్పండి ? అదీగాక, ఇప్పుడు ప్రసాదు మావాళ్ళకునచ్చు తాడో లేదో నన్న అనుమానం కూడా నాక్కలిగింది. ప్రసాదును పెళ్ళాడటానికి నాకు తెలిసిన కారణమే నిజమయితే, అదిప్పుడు లేదు కనక శకుంతల ఈ పెళ్ళి కొప్పుకొంటుందనుకోను. ఒక వేళ శకుంతల వొప్పుకున్నా మా ఆవిడ అసలే వొప్పుకోదు.

"మంచిది నాయనా ! ఏదో పనుండి పోతూ పోతూ చూసి పోదామని వచ్చాను. ఏ సంగతీ నాకు రెండు మూడు రోజుల్లో కనిపించి చెప్పు. నా చేతనై నంతవరకూ నేను నీకు సాయపడతాను. కష్టాలు ఎలాంటి వాళ్ళకైనా వస్తాయి. మనిషి నిలబడవలసింది అప్పుడే !" అన్నాను.

నా మనస్సంతా కెలికినట్లయింది. ఇంటికొచ్చాక 'ఏమయిందేమిటి ?' అన్నదావిడ. నేనే సమాధానమూ చెప్ప లేదు. కానీ సాయంత్రానికల్లా, ఈ సంగతి ఊరంతా పాకి పోయింది. ఫలానా పరంధామయ్యగారి ఆస్తంతా పోయిం దనీ, వాళ్ళబ్బాయి, పొట్ట చేతబట్టుకొని ఉద్యోగాలకోసం

వెతుకుతున్నాడనీ, అంతా ఆ గుబ్బుగా అనుకొన్నారు.

"అదేమిటోయ్! అందరూ, బంగారపు పిచ్చుక నీకు అల్లుడు కాబోతున్నాడనుకొంటే ఇలా జరిగిందేమిటి ?" అన్నా రెవరో.

"ఇప్పటికయినా అతను మా అమ్మాయిని చేసుకొంటే నా కభ్యంతరం లేదు. బంగారు పిచ్చుక అప్పుడయినా అవుతాడే!" అన్నాను నేను నవ్వుతూ.

మా ఆవిడ రివ్వ్వ్న వచ్చి అందుకుంది.

"చాల్లెండి, మీ దిక్కుమాలిన ఆలోచనలూ మీరూను. వీధిన పొయ్యే బికారి కివ్వడానికి, నా కూతురు కుంటిదా గుడ్డిదా? చేతకాకపోతే మీరలా చూస్తూ కూచోండి. దానికి రాజాలాంటి మొగుణ్ని తెచ్చి నేను చేస్తాను" అన్న దావిడ.

ఇది జరిగిన మొన్నాడు ప్రసాదు మా ఇంటికొచ్చాడు. తన కెక్కడా ఉద్యోగం దొరకలేదన్నాడు. సహాయం చేస్తారనుకొన్న వాళ్ళంతా తప్పుకొన్నారన్నాడు. తన కిప్పుడు పెద్ద పెద్ద ఆశలేమీ లేవన్నాడు. ముందుగా తన తలిదండ్రులను ఇక్కడికి తీసుకురానాలనీ, అందుకోసం తనకింత ఆధరువు కావాలనీ అడిగాడు. శకుంతలను తనిప్పటికీ ప్రేమిస్తున్నానన్నాడు. కొద్దిరోజుల తరువాత, తను పెళ్ళాడ గలననికూడా చెప్పాడు. నేను చెప్పాలనుకొన్న సమాధానం వేరు. నా కా అవకాశం లేకుండానే ఆవిడొచ్చి అనదలిచిన నాలుగు అనేసింది. ప్రసాద్ కళ్ళల్లో నీరు తిరగడం నేను చూశాను.

## కథకుడు చెప్పిన కథ

ఒక్కో మనిషి ఇతరుల అనుభవాల నుండి నేర్చుకొంటాడు. ఒక్కొక్కడు ప్రతిదీ తన అనుభవంలోకి రావాలంటాడు. పరంధామయ్య గారబ్బాయి ఈ రెండో కోవలోకి చేరిన బాపతు. అతను భ్రమతో కూడిన వాతావరణంలో పుట్టాడు. అక్కడే పెరిగాడు. ఆ భ్రమ తప్ప మరేదీ అతనికి నిజ మనిపించేది కాదు. తన చుట్టూ చేరినవారంతా సజ్జనులే ననుకోవడం అతని పొరబాటే! మరెవరో తనను మోసగించారనుకోవడంలోనూ అర్థం లేదు. మోసం చేసేవారు ఎప్పుడూ ఉంటూనే ఉంటారు. మోసం చేయడం వారి గుణం. అది నైజం కాకపోవచ్చు! పరిస్థితుల వల్లనే అలా వారు చేస్తూ ఉండవచ్చు. కానీ చేయడం మాత్రం ఖాయం.

ఈ సంఘటనతో అతని కళ్ళు తెరిపిళ్ళు పడ్డాయి. మనుషులను అర్థం చేసుకోడానికి ఈ సంఘటన ఎంతగానైనా ఉపకరించింది. ఇంతకాలమూ తనచుట్టూ ఉన్నవారెవరో అతనికిప్పుడు అర్థమయిపోయింది. తీరా తెలుసుకొనే వేళకు వారందరూ అతనికి దూరమయిపోయారు.

మేనమామ ఉన్న కసినంతా తీర్చుకొని వెళ్ళిపోయాడు.

శంకరం తన ప్రొడక్షను గొడవలో, మాట్లాడటానికే అవకాశం ఇవ్వలేదు. లలితాంబ, తన్ను చూసి ముఖం తిప్పుకొని పోయింది. శకుంతల నడిగితే, తనకిప్పుడు పెళ్ళాడాలన్న ఉద్దేశమే లేదంది. ఈ సంగతులన్నీ జ్ఞాపకం చేసుకొని ప్రసాద్ చిరునవ్వు నవ్వుకొన్నాడు.

మూడో రోజున మరో రకం వార్తలు వెలువడ్డాయి. పరంధామయ్యగారి ఫాక్టరీలు తగలపడిన మాట నిజమే గానీ, అందువల్ల వారికేమీ నష్టం లేదనీ, వాటి వాటి ఖరీదులకు సరిపడా అవన్నీ ఇన్స్యూర్ చేయబడ్డాయనీ అన్నారు. క్లబ్బులో ముట్టుకొన్న ఈ చిచ్చు అంతటా పాకింది.

ముందుగా శకుంతల వచ్చింది. వస్తూనే కళ్ళంట నీళ్ళు పెట్టుకొంది. తుడుచుకోకుండానే సంచీని పక్కన పెట్టింది.

"ఏమిటిది ?" అన్నాడతను.

"మా అమ్మతో దెబ్బలాడి వచ్చేశాను. ఇక నే నా కొంపలోకి అడుగు పెట్టను. ఇంత కాలం నన్ను బొమ్మను ఆడించినట్టు ఆడించింది. ఇక ముందు నేనలా ఆడ దలుచుకోలేదు. నిన్ను చేసుకొంటే, ఇంటిగడప తొక్కనివ్వనన్నది. సరేనంటూ వచ్చేశాను'' అన్నది శకుంతల.

"మంచిపని చేశావు" అన్నాడు ప్రసాదు.

శంకరం కూడావచ్చాడు. నిన్న నలా మాట్లాడినందుకు క్షమించ మన్నాడు. తనవల్ల ఏ సహాయం కావాలన్నా చేస్తానన్నాడు. అదన్నాడు, ఇదన్నాడు, చాలా చాలా అన్నాడు.

అంతా విన్నాక ప్రసాద్ ఒకసారి తనలో తనే నవ్వు కొన్నాడు. ఒక్కసారి వారిద్దరికేసీ చూసి, మునుపంటి పెదవి కొరుక్కున్నాడు.

"మళ్ళా మీరందరూ నా చుట్టూ మూగుతున్నారు. బహుశా ఆ అవకాశం లేనివాడు మా శేషగిరి మావయ్యొక్కడే ననుకొంటాను. ఆయనైనా ఈ ఊళ్ళో ఉండటం జరిగితే తప్పకుండా వస్తాడు. మిమ్మల్ని రప్పించిం దేమిటో నాకు తెలుసు... నన్ను చెప్పనివ్వండి. మీ అభిమానం కానేకాదు. నా డబ్బు! అవునా? నిన్న నేను బికారినని తెలిశాక అందరూ దూరంగా తొలిగారు. ఈ రోజున ఇన్స్యూర్ సంగతి తెలిసి అంతా దగ్గర కొచ్చారు" అన్నాడు ప్రసాద్ చాలా మామూలుగా.

"కాదు" అన్నది శకుంతల.

"నిజంగా ఇప్పటికీ నేను బికారినే! నాకు ఇన్స్యూర్‌లో ఏమీ రాలేదు. మీ గుణాలు తెలుసుకొందామని, నేనే ఆ వార్త పుట్టించాను. ఊం చిట్టితల్లీ! నన్ను పెళ్ళాడటానికి నువ్వు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నావా? నీకు కావలసింది నేను గానీ, నా డబ్బు కాదుగదా? అయినప్పుడు నీకు అభ్యంతరం ఉండకూడదే మరి?" అన్నాడు ప్రసాద్.

"స్టుపిడ్!" అన్నాడు శంకరం కోపంగా.

"ఇది మీ నిజస్వరూపం. ఇంతకాలం తెలుసుకోలేక పోయాను. నా కళ్ళు తెరిచారు. అందుకు చాలా కృతజ్ఞుణ్ని.

అసలు సంగతేమిటంటే, మా ఫాక్టరీలకు ఎటువంటి నష్టమూ రాలేదు. అవి నిక్షేపంగా పనిచేస్తున్నాయి. ఇప్పటికీ నేను కోటీశ్వరుణ్నే ! జపాను యువరాజు, ఓ సామాన్య యువతిని పెళ్ళి చేసుకొన్నా . నేను మా నరుసును పెళ్ళాడబోతు న్నాను. కావటానికి పనిమనిషయినా, అది మనిషి. మీరు పశువులు !" అన్నాడు ప్రసాద్ చిరునవ్వు నవ్వుతూ.